ప్రతి గర్భిణికి హెచ్ఐవీ పరీక్షలు చేయించాలి

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29 : ప్రతి గర్భిణీకి హెచ్ఐవీ పరీక్షలు జరిగేలా చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో హెచ్ఐవీ-ఎయిడ్స్‌పై అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ నిర్వహించారు. గురువారం జిల్లా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుట్టిన బిడ్డకు హెచ్ఐవీ సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని ఆయన తెలిపారు. అదనపు డీఎంహెచ్‌వో పాపారావు మాట్లాడుతూ జిల్లాలోని ప్రతీ హెచ్ఐవీ టెస్టింగ్‌లో గర్భిణులకు టెస్టులు చేయించాలన్నారు. కార్యక్రమంలో నరేందర్, జి.రమేష్ పాల్గొన్నారు.



చేవెళ్ల మార్కెట్ పరిసరాల్లో రైతులు పారబోసిన టమాటాలు

టమాట ధర ఢమాల్

- కన్నీరు పెడుతున్న రైతు
- డిమాండ్ లేక అమ్ముడుపోక రోడ్డుపై పారబోత

చేవెళ్ల, ఆగస్టు 29: రెండు నెలల క్రితం భారీగా పలికిన టమాట రేటు ఇప్పుడు ఒక్కసారిగా తగ్గడంతో రైతుల కష్టం రోడ్డుపాలవుతోంది. పెట్టిన పెట్టుబడిలో పదోవంతు కూడా రాక రైతులు గగ్గోలు పెడుతున్నారు. పండించిన పంటను మార్కెట్‌కు తరలిస్తే అక్కడ రేటు లేక యార్డులోనే పారబోస్తున్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల డివిజన్‌లో 750 ఎకరాల్లో టమాటాను సాగుచేశారు. వర్షాలతో దిగుబడి బాగానే ఉండటంతో రైతులు పెద్దమొత్తంలో టమాటాలను మార్కెట్‌కు తెస్తున్నారు. చేవెళ్ల మార్కెట్‌లో రెండు నెలల క్రితం దాదాపు రూ. 2 వేల వరకు పలికిన 25 కిలోల టమాట బాక్స్ ధర గురువారం రూ. 100 నుంచి 250 మాత్రమే పలికింది. దీంతో పెట్టుబడైనా రాదని రైతులు వాపోతున్నారు. వర్షాలతో దిగుబడి పెరగడంతో నిత్యం వందలాది బాక్సుల టమాట మార్కెట్‌కు వస్తోంది. దీంట్లో బాగా ఉన్న టమాటాలనే నామమాత్ర ధరకు వ్యాపారులు కొంటున్నారు. చాలా మంది రైతుల టమాట అమ్ముడుపోక రోడ్డు పక్కన పారబోసి వెళ్లిపోతున్నారు. కొందరు రైతులయితే ధరలేదని టమాట తెంపడం లేదు. కురుస్తున్న వర్షాలతో టమాటాలకు మచ్చలొచ్చి నిలువ ఉండవని, అందుకే ఎక్కువగా కొనడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. పంట ఉత్పత్తి ఎక్కువ ఉండడంతో చేవెళ్ల మార్కెట్‌కు నిత్యం ఎనిమిది వందల నుంచి వెయ్యి బాక్స్‌ల టమాట వస్తోందని, అందుకే సరిపడా డిమాండ్ లేక ధర పడిపోయిందని వారు అంటున్నారు. అయితే వ్యాపారులు తమ వద్ద 25 కిలోల బాక్స్‌ను రూ. 100 నుంచి 150కే కొని వినియోగదారులకు మాత్రం ఎక్కువ రేటుకు అమ్ముకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ధర అమాంతం తగ్గడంపై మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ప్రభుత్వమే టమాటను కొని తాము నష్టపోకుండా ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



జనాభా నియంత్రణకు తీసుకుంటున్న చర్యల్లో ప్రధానమైనవి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు. ఇందులో ముఖ్యమైనవి ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించే డీపీఎల్ క్యాంపులు. ఈ ఆపరేషన్లు చేయించుకునేందుకే ఎక్కువ మంది ముందుకు వస్తారు. కానీ, జిల్లాలో 22 నెలలుగా ఈ ఆపరేషన్లు జరగడం లేదు. ఇబ్రహీంపట్నంలో ఆపరేషన్లు చేయించుకున్న వారిలో నలుగురు మహిళలు మరణించడంతో ఈ ఆపరేషన్లను అప్పటి నుంచి ఆపేశారు. ఇదంతా జరిగి దాదాపు రెండేళ్లు కావస్తున్నా అధికారులు వీటిని పునరుద్ధరించడంలో తాత్సారం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన ఈ ఆపరేషన్లను ప్రస్తుత ప్రభుత్వంలోనైనా తిరిగి ప్రారంభించాలని మహిళలు కోరుతున్నారు.

- ప్రస్తుతం ట్యూబెక్టమీ, వెసక్టమీ ఆపరేషన్లే దిక్కు
- కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు ప్రైవేట్ ఆసుపత్రుల వైపు మొగ్గు
- వెసక్టమీకి దూరంగా ఉంటున్న పురుషులు
- డీపీఎల్‌కు అనుమతివ్వాలంటున్న మహిళలు

డీపీఎల్ ఎప్పుడు?

ఇబ్రహీంపట్నం ఘటనతో బ్రేక్.. 22 నెలలుగా ఊసెత్తని ప్రభుత్వం

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29 : రెండేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం ఘటనతో బ్రేక్ పడిన డీపీఎల్ ఆపరేషన్లు మళ్లీ తిరిగి ప్రారంభించనే లేదు. వైద్య ఆరోగ్యశాఖ డబుల్ పంక్చర్ ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్ల (డీపీఎల్) ఊసే ఎత్తడం లేదు. ఇబ్రహీంపట్నంలో వైద్యుల నిర్లక్ష్యంతో నలుగురు మృతి చెందిన ఘటనతో డీపీఎల్ ఆపరేషన్లు నిలిపివేశారు. ఇది జరిగి సుమారు 22 నెలలు అవుతున్నా ఈ ఆపరేషన్ల గురించి ఆలోచించిన దాఖలాలు కనిపించడం లేదు. రెండు, మూడో కాన్పు తర్వాత మహిళలు ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకుంటున్నారు. డబుల్ పంక్చర్ ల్యాప్రోస్కోపిక్ (డీపీఎల్) ఆపరేషన్లు చేయాలని మహిళలు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో నిలిచిన ఈ ఆపరేషన్లు తిరిగి కొత్త ప్రభుత్వంలోనైనా ప్రారంభించాలని మహిళలు కోరుతున్నారు. ఎలాంటి కోత లేకుండా నిర్వహించే ఈ ఆపరేషన్‌పై మహిళలు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ట్యూబెక్టమీ ఆపరేషన్లు మాత్రమే చేస్తున్నారని మహిళలు వాపోతున్నారు.

ట్యూబెక్టమీ ఆపరేషన్లు

సంవత్సరం	డీపీఎల్ క్యాంపు	ప్రభుత్వ ఆసుపత్రి	ప్రైవేటు ఆసుపత్రి	మొత్తం ఆపరేషన్లు
2021-22	7,223	672	7,925	15,820
2022-23	1,933	459	4,475	6,867
2024-25	00	200	1,218	1,418

వెసెక్టమీ ఆపరేషన్ల వివరాలు

సంవత్సరం	ప్రభుత్వ ఆసుపత్రి	ప్రైవేటు ఆసుపత్రి	మొత్తం ఆపరేషన్లు
2021-22	27	00	27
2022-23	14	01	15
2024-25	03	02	05

ట్యూబెక్టమి ఆపరేషన్ చేయించుకుంటే..

ట్యూబెక్టమి ఆపరేషన్ చేసుకుంటే ఆసుపత్రిలో వారం రోజుల పాటు ఉండాల్సి వస్తుంది. రూ.10వేల నుంచి 50 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. అలాగే మరో 15 రోజుల పాటు విశ్రాంతి కూడా తీసుకోవాల్సి ఉంటుంది. డబుల్ పంక్చర్ ల్యాప్రోస్కోపిక్ ఆపరేషన్ అయితే కేవలం మూడు, నాలుగు గంటల తర్వాత డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉంటుంది. జిల్లాలో డబుల్ పంక్చర్ ల్యాప్రోస్కోపిక్ (డీపీఎల్) ఆపరేషన్ క్యాంపులను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. ఇబ్రహీంపట్నంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 2022 ఆగస్టు 25వ తేదిన 34 మందికి డీపీఎల్ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయగా, వారిలో నలుగురు చనిపోయారు. (మమత, సుష్మ, మౌనిక, లావణ్య) మిగతా వారిని వెంటనే వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించడంతో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్ యాక్షన్ తీసుకుంది. ఆపరేషన్లు చేసిన డాక్టర్ జోయల్ సునీల్‌కుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసింది. అంతా కాకుండా జిల్లా వైద్యాధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డీసీహెచ్ఎస్ ఝాన్సీపై బదిలీ వేటు వేసింది. వీరితో పాటు మొత్తం 13మందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. బాధ్యులపై చర్యలతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేలా మార్గదర్శకాలు జారీ చేసింది. 2021-22లో డీపీఎల్ క్యాంపు ద్వారా 7,223 మంది మహిళలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకున్నారు. 2022-23లో 1,933 మంది ఆపరేషన్ చేయించుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతీ నెలా 80-145 వరకు డీపీఎల్ క్యాంపుల ద్వారా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేసుకునేవారు. కానీ.. ఇబ్రహీంపట్నం ఘటనతో డీపీఎల్ క్యాంపులను బ్రేక్ పడింది. ఇంతవరకు మళ్లీ దీని గురించి ఆలోచించిన నాథుడే లేదు. డీపీఎల్ కోసం మహిళలు ఎదురు చూస్తున్నారు.

వెసక్టమీకి దూరంగా పురుషులు..

వెసక్టమీ.. ఈ పేరు వింటేనే పురుషులు పరుగులు తీస్తున్నారు. కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సల్లో భాగంగా చేసుకోవాల్సిన ఈ ఆపరేషన్‌లకు వెనుకంజ వేస్తున్నారు. కేవలం అపోహలే దీనికి కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. వెసక్టమీ గణాంకాలు పరిశీలిస్తే ఇదే విషయం తేటతెల్లమవుతుంది. వెసక్టమీకి తాము దూరమంటూ భారం బాధ్యతంతా ఇల్లాలిదే అన్నట్లు కొందరు ప్రదర్శిస్తున్నారు. దీంతో ఒకరిద్దరు పిల్లలను కనగానే మహిళలకు ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించేస్తున్నారు. జిల్లాలో 2022-23లో 27 మంది పురుషులు ప్రభుత్వ ఆసుపత్రిలో వెసక్టమీ ఆపరేషన్ చేయించుకున్నారు. అలాగే 2023-24లో ఈ సంఖ్య ఇంకా తగ్గింది. మొత్తం 15 మంది వెసక్టమీ ఆపరేషన్ చేయించుకోగా అందులో ప్రభుత్వ ఆసుపత్రిలో 14, ఒకరు మాత్రమే ప్రైవేట్ ఆసుపత్రిలో వెసక్టమి ఆపరేషన్ చేయించుకున్నారు. 2024-25 జూలై వరకు నమోదైన కేసులను పరిశీలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. కేవలం ముగ్గురు పురుషులు మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వెసక్టమీకి చేయించుకోగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఇద్దరు మాత్రమే చేయించుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో కలుపుకుని మొత్తం ఐదుగురు మాత్రమే వెసెక్టమీ చేసుకున్నారు. వెసెక్టమీ ఆపరేషన్లు చేసుకునేందుకు పురుషులు ముందుకు రావడం లేదు.

ప్రైవేట్ ఆసుపత్రుల వైపు మొగ్గు

కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌ల కోసం ప్రైవేట్ ఆసుపత్రుల వైపు మహిళలు మొగ్గు చూపుతున్నారు. 2022-23లో ప్రభుత్వ ఆసుపత్రులో 672 మంది మహిళలు ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకోగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో 7,925 మంది మహిళలు ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకున్నారు. 2023లో 459 ట్యూబెక్టమీ ఆపరేషన్లు జరిగాయి. అలాగే 2023-24లో ఇప్పటి వరకు 200 మంది ఆపరేషన్లు చేయించుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల కంటే ప్రైవేట్ ఆసుపత్రులోన్లే ట్యూబెక్టమీ ఆపరేషన్లు ఎక్కువగా జరిగినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వ వైద్యంపై నమ్మకం లేకపోవడంతో చాలావరకు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ప్రభుత్వం కు.ని ఆపరేషన్లు చేయాలి



ప్రభుత్వం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించాలి. ప్రభుత్వం ఆపరేషన్లు కొంత కాలంగా చేయకపోవడంతో చాలా మంది మహిళలు ప్రైవేట్ ఆసుపత్రుల్లోకి వెళ్లి చేయించుకుంటున్నారు. మరికొంత మంది డెలివరీ సమయంలోనే చేయించుకుంటున్నారు. దీంతో పేద ప్రజలపై ఆర్థిక భారం పడుతుంది. ప్రభుత్వం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలి.

- మల్గ వనజ, చేవెళ్ల

గైడ్‌లైన్స్ రాగానే ప్రారంభిస్తాం



ప్రభుత్వం నుంచి గైడ్‌లైన్స్ రాగానే జిల్లాలో డీపీఎల్ క్యాంపులను నిర్వహించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లను ప్రారంభిస్తాం. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో ట్యూబెక్టమి, వెసక్టమీ ఆపరేషన్లు చేస్తున్నారు.

- డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి

కన్హా శాంతివనం సేవలు అభినందనీయం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం



వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న భట్టి విక్రమార్క

నందిగామ, ఆగస్టు 29: నందిగామ మండలంలో నెలకొన్న కన్హా శాంతి వనం ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలు అభినందనీయమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. కన్హా శాంతివనంలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను గురువారం రాంచంద్రమిషన్ సంస్థ గురూజీ కమలేష్‌పటేల్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లతో కలిసి విక్రమార్క ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యానకేంద్రాన్ని ఇక్కడ నిర్మించడం రాష్ట్ర ప్రజల అదృష్టమని, షాద్‌నగర్ ప్రాంతంలో కన్హాశాంతివనం నిర్మించడం ఈ ప్రాంత వాసులకు వరం అన్నారు. శాంతివనంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ ద్వారా ప్రజలకు అన్ని రకాల ఆయుర్వేదిక, ప్రకృతి వైద్యం అందుతుందని తెలిపారు. ఆరోగ్యకర భవిష్యత్తుకు హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ హోలిస్టిక్ వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం తనకు సంతోషకరంగా ఉందన్నారు. ఆయూష్‌తో కలసి అనేక రకాల చికిత్సలకు కేంద్రంగా హైడ్రోథెరపీ, ఆయుర్వేదం, న్యాచురోపతి, హోమియోపతి వైద్య విధానాలు ఒకేచోట లభించేలా వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించామని కమలేష్ పటేల్ తెలిపారు. అంతకు ముందు విక్రమార్క గురూజీతో కలిసి 15నిమిషాల పాటు ధ్యానం చేశారు. అనంతరం గురూజీ కమలేష్ పటేల్, ఎమ్మెల్యేలతో కలిసి మొక్క నాటారు. కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ శ్రీవర్మ, మాజీ ఎంపీపీ ప్రియాంకశివశంకర్‌గౌడ్, జంగ నర్సింలు, కొమ్ము క్రిష్ణ, చంద్రపాల్‌రెడ్డి, బుచ్చయ్య, రాంచంద్రమిషన్ ప్రతినిధులు, అభ్యాసకులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని చేగూర్‌లో పాఠశాల భవనం, ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించాలని ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ ప్రియాంకశివశంకర్‌గౌడ్ మల్లు విక్రమార్కకు వినతిపత్రం అందజేశారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధం

- అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 29 : స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం అవుతున్నట్లు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ తెలిపారు. గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలుగా సమాయత్తం అవుతున్నట్లు చెప్పారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వంటి ప్రక్రియలను తక్షణమే చేపట్టి నిర్ణీత గడువు లోపు పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన పోలింగ్ సిబ్బందిని గుర్తించి వారికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో విధులను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన తీజ్ సంబరాలు



మొలకలకు నీరు పోస్తున్న యువతులు, మొలకల బుట్టను ఎత్తుకున్న యువతి

కడ్తాల్, ఆగస్టు 29 : గిరిజనుల సంస్కృతీ సంప్రదాయానికి ప్రతీక అయిన తీజ్ వేడుకలను కడ్తాల మండలం గాన్గుమర్ల తండాలో గురువారం అట్టహాసంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు వివిధ ప్రాంతాలలో ఉన్న తండావాసులు, బంధువులు వేలాదిగా తరలి రావడంతో గాన్గుమర్ల తండా జన సంద్రమైంది. వేడుకల్లో యువతీ యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. గిరిజనుల సహజ వేషధారణతో యువతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తొమ్మిది రోజుల పాటు పూజలు చేసి పెంచిన మొలకల బుట్టలను ఆలయాల్లో ఉంచి పూజలు చేశారు. అనంతరం పెళ్లికాని యువతులు పట్టు వస్త్రాలు ధరించి బుట్టలనెత్తుకొని ఊరేగింపు నిర్వహించారు. తమను చల్లగా చూడాలని, పాడిపంటలు సమృద్ధిగా కలగాలని కోరుకున్నారు. మొలకల బుట్టలను ఎత్తుకొని భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొలకల బుట్టలను తండా సమీపంలోని చౌడమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి, మహేశ్వరం ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయం, వైభవానికి తీజ్ పండుగ ప్రతీకగా నిలుస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎడ్మ సత్యం, అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు జర్పుల దశరథ్ నాయక్, ఉప్పల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



వేడుకల్లో ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు

మొలకల బుట్టలతో యువతులు

చెడు అలవాట్లకు గురికావద్దు

శామీర్‌పేట, ఆగస్టు 29: యువత చెడు అలవాట్లకు గురికావద్దని పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు పిలుపునిచ్చారు.మండలంలోని తుర్కపల్లి సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్‌లో కమ్యూనిటీ పోలీసింగ్ తుర్కపల్లి జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీ బాల్ పోటీలను ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్‌తో కలిసి ఏసీపీ గురువారం ప్రారంభించారు. యువత చెడు అలవాట్లను వదిలిపెట్టి గొప్ప ఆశయంతో ముందుకెళ్లాలని సూచించారు. క్రీడల్లో రాణించాలని సూచించారు. తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ ఇన్‌స్పెక్టర్ యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిక కావద్దన్నారు. క్రీడల్లో నిత్యం శిక్షణ పొంది క్రీడాపోటీల్లో పాల్గొని జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో రికార్డులు నెలకొల్పాలన్నారు.కాగా ఈ వాలీబాల్ క్రీడాపోటీల్లో శామీర్‌పేట మండలంలోని తుర్కపల్లి, లాల్‌గడి మలక్‌పేట, కొల్తూర్ పరిధిలోని యువత, జీనోమ్‌వ్యాలీ పోలీసుల టీమ్‌లు కలసి తొమ్మిది టీములుగా వాలీబాల్ క్రీడాపోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతి తుర్కపల్లి ఏటీమ్ గెలుపొందగా, లాల్‌గడి మలక్‌పేట టీమ్ ద్వితీ, జీనోమ్‌వ్యాలీ పోలీసుల టీమ్ తృతీయ బహుమతులు సాధించాయి. ఈ టీమ్‌లకు సాయంత్రం ఏసీపీ రాములు ప్రోత్సాహక బహుమతులతో పాటు ట్రోఫీలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ వైఎస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, తుర్కపల్లి గ్రామస్తులు తిరుపతి రెడ్డి, యూసుఫ్ ఎబాబా, జీనోమ్‌వ్యాలీ పోలీసులు పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న ఏసీపీ రాములు

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

తాండూరు, ఆగస్టు 29: మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. తాండూరు పట్టణంలోని ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థల ప్రిన్సిపల్‌తో గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ నియమ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. తాండూరులో మైనర్లు అధికంగా డ్రైవింగ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇకపై మైనర్లు వాహనాలు నడుపుతూ కనిపిస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా మైనర్ డ్రైవింగ్, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలపై మాదక ద్రవ్యాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో తాండూరు అర్బన్ సీఐ సంతోష్ కుమార్ పాల్గొన్నారు.


ప్రైవేటు, ప్రభుత్వ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

నాటిన మొక్కలను సంరక్షించాలి

తాండూరు రూరల్, ఆగస్టు 29: 2019-20 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరంలలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. తాండూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో విశ్వప్రసాద్ అధ్యక్షతన ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎండిన మొక్కల స్థానంలో తిరిగి మొక్కలు నాటాలని తెలిపారు. నర్సరీల్లో ప్రైమరీ షెడ్లను నిర్వహించాలన్నారు. వీటిలో సర్వే మేరకు నర్సరీలో గ్రేడింగ్, షిఫ్టింగ్, కలుపు నివారణ చర్యలు చపట్టాలన్నారు. మొక్కల వివరాలను పీఎస్ సహాయంతో మొక్కలు అందించాలన్నారు. నర్సరీల్లో మిగిలిన మొక్కలు, ఇతర వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు.అవసరమైన పని గుర్తింపు సంఖ్యకు వాచర్‌ను నియామకం చేయడానికి వాచర్, పేరు, జాబ్ కార్డు నెంబర్, మొబైల్ నెంబర్, కేటాయించిన పని గుర్తింపు సంఖ్య, మొక్కలు, లోకేషన్ వివరాలను టెక్నికల్ అసిస్టెంట్ తన క్లస్టర్‌కు సంబంధించిన వివరాలను కార్యాలయంలో అందించాలన్నారు. ఈ సమావేశంలో టీఏ, ఎఫ్ఏ లు మధు, జావెద్, చంద్రయ్య, బాలయ్య, సాయి ప్రసాద్, చిన్న కాజీలప్ప, ఎల్లప్ప, శ్రీనివాస్, మంగమ్మ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.


టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశమైన ఎంపీడీవో విశ్వప్రసాద్

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

జేఎన్టీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఆశారాణి

ఘట్‌కేసర్, ఆగస్టు 29: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని విద్యలో రాణించేందుకు నిరంతరం శ్రమించాలని జేఎన్టీయూ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఆశారాణి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్‌లో గల సంస్కృతీ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ ఫస్టియర్ విద్యార్థుల ఓరియెంటేషన్ కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు మొదటి నుంచి చదువుపై దృష్టి సారిస్తే ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. బీటెక్ జీవితంలో కేరీర్‌కు మార్గం కావాలని ఆదిశగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. సమయం చాలా విలువైందని దాన్ని సద్వినియోగం చేసుకోవడానికి నిరంతరం పుస్తకాలతో కుస్తీపట్టాలన్నారు. వ్యవనాలకు, అల్లరి పనులకు దూరంగా ఉంటూ లక్ష్యసాధనకు ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఏవీ రమణారెడ్డి, ఏడీఆర్ఐఎన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నోవాలిన్ జాకబ్, ప్రముఖ మోటివేటర్ అభిషేక్ సింగంశెట్టి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నీలంసింగ్, విద్యాసంస్థల సలహాదారు డాక్టర్ భాగ్యరాజ్, డైరెక్టర్ డాక్టర్ మల్లాడి రమాకాంత్‌రెడ్డి, డాక్టర్ ఎం.రాజేశ్వర్‌రెడి, ఆయా విభాగాల డీన్‌లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


అతిథికి జ్ఞాపికను అందజేస్తున్న కళాశాల చైర్మన్ రమణారెడ్డి

రైతుల సంక్షేమానికి కృషి చేద్దాం: మాధవరెడ్డి

బషీరాబాద్, ఆగస్టు 29: రైతుల సంక్షేమానికి పాలక వర్గమంతా కలిసికట్టుగా కృషి చేద్దామని బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మాధవరెడ్డి అన్నారు. బషీరాబాద్‌లోని ఏఎంసీ కార్యాలయంలో గురువారంతొలిసారి పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మార్కెట్ అభివృద్ధికి, పలు అంశాలపై కార్యవర్గంతో చర్చిస్తూ తీర్మానాలు చేశారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి సహకారంతో మార్కెట్ కమిటీకి పక్కభవనం, షెడ్ వద్ద ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేసుకుందామన్నారు. మార్కెట్‌కు ఆదాయ వనరులు లేకపోవడంతో ఇబ్బందులు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు.అందరి సహకారంతో మున్ముందు స్థానికంగా మార్కెట్ ప్రారంభించి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్ల క్రయవిక్రయాలు జరిగేలా చర్యలు తీసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మూడవత్ చందర్, పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, పాలకవర్గం సభ్యులు వడ్డే హన్మంతు, అనుప్‌ప్రసాద్, ఎన్.నరేష్, కె.మహేందర్‌రెడ్డి, ఎస్.వనమాల, మునీర్, పి.కె.పెంటప్ప, ఎ.సత్తయ్య, కె.నరేష్, నరేష్‌రథోడ్, ఈ. పాండురంగ, కార్యదర్శి లక్ష్మణ్, సూపర్‌వైజర్ రాములు, సిబ్బంది శివ తదితరులు పాలల్గొన్నారు.


పాలకవర్గంతో మాట్లాడుతున్న మాధవరెడ్డి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీవో సుజాత

ముగిసిన జోనల్‌స్థాయి క్రికెట్ టోర్నీ

కడ్తాల్, ఆగస్టు 29 : కడ్తాల్ సమీపంలోని బటర్ ఫ్లై క్రికెట్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జోనల్ స్థాయి ఫ్రీడమ్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఆమనగల్లు, మాడ్గుల, కడ్తాల్, తలకొండపల్లి మండల్లోని 20జట్లకు చెందిన 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. టోర్నీ ఫైనల్‌లో పడకల్ జడ్పీ పాఠశాల, మైసిగండి ఆశ్రమ పాఠశాల టీంలు తలపడ్డాయి. పడకల్ విన్నర్‌గా, మైసిగండి పాఠశాల రన్నర్స్‌గా నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి ఎంపీడీవో సుజాత హాజరై క్రీడాకార్యదర్శి భీముడుతో బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి పోటీలకు టీంను ఎంపిక చేశారు. విద్యార్థులు చిన్నప్పటి దశ నుంచే క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు సాబెర్, జ్యోతి, రాధ, మంజుల, బటర్ ఫ్లై స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవ్ నాంపల్లి, టీచర్లు పాల్గొన్నారు.


మట్టి వినాయక ప్రతిమలతో ప్రిన్సిపాల్ తదితరులు

పర్యావరణ పరిరక్షణకు
ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 29 : పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ప్రాజెక్టు ఆఫీసర్ బి.నాగేశ్వర్‌రావు అన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం 'మట్టి గణపతి మహాగణపతి' కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు భూమిపై 33శాతం అడవులు ఉండాలని సూచించారు. గాలి, నీరు కలుషితం బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. మట్టి వినాయక విగ్రహాలనే ప్రతిష్ఠించుకోవాలని సూచించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు మట్టి విగ్రహాలను తయారు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రాధిక, వైస్‌ప్రిన్సిపాల్ కె.సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎ.రచన, ఎస్.రమేష్, అకడమిక్ కో-ఆర్డినేటర్ నరేందర్‌రెడ్డి, న్యాక్ కో-ఆర్డినేటర్ శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విగ్రహ ప్రతిష్ఠ వేడుకలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆధ్యాత్మికతతో ఆనందమయ జీవనం

కడ్తాల్, ఆగస్టు 29: ప్రతీ మనిషి ఆధ్యాత్మికతను అలవర్చుకుంటే ఆనందమయ జీవనాన్ని గడపొచ్చని కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. కడ్తాలలోని సాయి మందిరంలో రెండు రోజులుగా కొనసాగుతున్న లలితాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో గురువారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివా స్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, కాంగ్రెస్ జిల్లా నాయకులు జి.భాస్కర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, జహంగీర్ అలీ, శ్రీకాంత్‌రెడ్డిలతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. నరస్వతిదేవి ఉపాసకులు లక్ష్మీనారాయణ భాగవతార్ నిర్వహించిన లలితాదేవి కల్యాణం, హరికథ కాలక్షేపం భక్తులను అలరించాయి. ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి, దైవకార్యక్రమాలకు తోడ్పాటునందిస్తుందని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, హన్మనాయక్, జహంగీర్‌బాబ, శేఖర్ గౌడ్, మల్లప్ప, రాజేందర్‌గౌడ్, వెంకటేశ్, లక్ష్మయ్య, కృష్ణ, రాములు, నర్సింహ, శారదమ్మ, కమలమ్మ, విజయమ్మ, గీత, నిర్మలమ్మ, సుమతమ్మ, భారతమ్మ, అర్చకులు వెంకటేశ్వరశర్మ పాల్గొన్నారు.


ఆమనగల్లులో బోనాల ర్యాలీ

ఘనంగా అమ్మోరికి బోనాలు

ఆమనగల్లు, ఆగస్టు 29: అమ్మోరు తల్లి తమను చల్లగా చూడాలని భక్తులు, ప్రజలు దేవతలను వేడుకున్నారు. ఆమనగల్లులో బోనాల వేడుకలకు గురువారం భక్తిశ్రద్ధలతో బోనాలు జరుపుకున్నారు. కుల సంఘాల ఆధ్వర్యంలో పోచమ్మ, పెద్దమ్మ, మడేలుస్వామిల బోనాలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు బోనాలతో ఆలయాలకు చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. కడ్తాల మండలం మక్తమాదారంలో పోచమ్మ, మైసమ్మ బోనాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, నాయకులు సులోచనసాయిలు, మంజులచంద్రమౌళి, అంజయ్య, రమేశ్, మల్లేశ్, యాదయ్య, కృష్ణయ్య, గోపాల్, రాములు, చెన్నయ్య, బాల్‌రాజ్, నర్సింహగౌడ్, పాల్గొన్నారు. అలాగే గట్టిప్పలపల్లి వేడుకల్లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జయమ్మవెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి

షాబాద్, ఆగస్టు 29: హిందూ ధర్మాన్ని ప్రతీ హిందువు పరిరక్షించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి శ్రీలతరెడ్డి అన్నారు. గురువారం షాబాద్‌లోని స్టార్ గార్డెన్‌లో భజరంగ్‌దళ్ విభాగ్ కోకన్వీనర్ గూడెం రమేష్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భగవద్గీత శ్లోకాల పారాయణం, డ్యాన్స్ పోటీలో శ్రీచైతన్య హైస్కూల్ మొదటి బహుమతి, అక్షర టాలెంట్ స్కూల్ రెండో బహుమతి, కస్తూర్బాగాంధీ, మాంటిస్సోరీ పాఠశాలలు మూడో బహుమతి గెలిచాయి. వారు మాట్లాడుతూ.. ప్రతీ హిందువు ధర్మం, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, ఉపాధ్యక్షులు భోజిరెడ్డి, రంగనాథ్, నాయకులు బర్క కృష్ణ, మద్దూరి పాండు, సోమశేఖర్, రాము, కిరణ్, మాణయ్య, నారాయణ, హరీష్, వినయ్, ధనుష్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గతేడాది పొంగిపొర్లుతున్న లక్నాపూర్ ప్రాజెక్టు(ఫైల్)

నాడు కళకళ... నేడు వెలవెల!


ప్రస్తుతం నీరులేక వెలవెలబోతున్న లక్నాపూర్ ప్రాజెక్టు

పరిగి, ఆగస్టు 29: వానాకాలం సీజన్, వర్షాకాలం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరుకు చెరువులు, కుంటల్లోకి నీరు చేరలేదు. జిల్లాలో అక్కడక్కడ చిన్నపాటిగా వర్షాలు కురిసినప్పటికీ పరిగి ప్రాంతంలో మాత్రం కురువలేదు. ఇప్పటివరకు ఏ ప్రాజెక్టులు, చెరువుల్లోకీ నీరు చేరలేదు. కనీసం ఇప్పటి వరకు వాగులు పారేంత వర్షం కూడా కురువలేదు. వాగులు, వంకలు, కుంటలన్నీ బోసిపోయి కనిపిస్తున్నాయి. అక్కడక్కడ అడపాదడపా కురుస్తున్న చిన్నపాటి జల్లులతో రైతులను ఆశలు రేకెత్తించినా పెద్దగా ప్రయోజనం చేకూరే వర్షాలు కరవడంలేదు. ముఖ్యంగా పరిగి, దోమ, కులకచర్ల, పూడూరు, చౌడాపూర్ మండలాల్లో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. ఈ ఏడాది అయితే ఏనాడూ పెద్ద వర్షం కురవలేదు. ఈ ప్రాంతానికి పెద్ద దిక్కయిన లక్నాపూర్ ప్రాజెక్టు 20 అడుగుల లోతు ఉండగా, ప్రస్తుతం ఒక అడుగునీరు కూడా ఇప్పటి వరకు చేరలేదు. 2023 ఆగస్టులోనే లక్నాపూర్ ప్రాజెక్టు పొంగి పొర్లింది. గతేడాది ఇప్పటి వరకు 663 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా ఈసారి 273 మి.మీ వర్షపాతం నమోదు కాగా, ఈసారి 273 మీ.మీ వర్షపాతమే నమోదైనట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో పరిగి, దోమ మండలాల్లో సాధారణ వర్షపాతం కురిసినట్లు రికార్డులు చెబుతున్నా ఎక్కడా చుక్కనీరు రాలేదు. గడిసింగాపూర్, ఇబ్రహింపూర్, మిట్టకోడూరు, దోమ, బాసుపల్లి, కిష్టాపూర్, ఐనాపూర్, ముజాహిద్‌పూర్, కులకచర్ల, అంతారం, పుట్టపహాడ్ తదితర చెరువుల్లోకి ఇంకా నీరు చేరలేదు. పంటల సాగుపై కూడా వర్షాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. ముఖ్యంగా వరిపంట సాగు సగాని కంటే ఎక్కువగా తగ్గిపోయిందనే చెప్పవచ్చు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులకు నిధులివ్వండి

▸▸ డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే, రైతుల వినతి


డిప్యూటీ సీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే శంకర్

కొత్తూర్/శంషాబాద్, ఆగస్టు 29: చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లిలో సాగు, తాగు నీటికోసం తలపెట్టిన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులకు నిధులివ్వాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలో రైతులు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు వినతిపత్రం అందజేశారు. గురువారం నందిగామ మండలం చేగూర్‌లోని కన్హా శాంతివనంలో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వెళ్తున్న విక్రమార్కకు తిమ్మాపూర్ వద్ద ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌పై రైతులు ఆశలుపెట్టుకున్నారని, ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం సమయం వృథా చేసిందని డిప్యూటీ సీఎంకు ఎమ్మెల్యే వివరిస్తూ వినతిపత్రమిచ్చారు. ఇందుకు భట్టి స్పందిస్తూ ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పనులు ప్రారంభిచేలా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీ ఎం.శివశంకర్‌గౌడ్, కొత్తూర్,నందిగామ మండలాల కాంగ్రెస్ నాయకులు హరినాథ్‌రెడ్డి, నర్సింహ, పి.రఘు, ప్రభాకర్, దేవేందర్‌ముదిరాజ్, కుమారస్వామి, చంద్రపాల్‌రెడ్డి, ఉప్పల దయానంద్‌గుప్తా, సిద్ధార్థరెడ్డి, శేఖర్ తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అలాగే శంషాబాద్ మండలం ఘాన్సిమియగూడ రైతులు తమ భూములకు పట్టా పాసుబుక్కులు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మహేందర్ ఆధ్వర్యంలో భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇచ్చారు. చౌదరిగూడ మండలానికి వెళ్తున్న ఆయనను నాయకులు కలిశారు. గ్రామంలోని 3, 4 సర్వే నంబర్లలోని భూములను ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. కొత్త పాస్ బుక్కులు ఇవ్వలేదన్నారు. ఈ భూములను గోల్డ్‌స్టోన్ కంపెనీ తరపున కొన్నామని ప్రసాద్, పార్థసారథి అనే ఇద్దరు రైతులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ నాగమణి సర్వే నంబర్ 4లోని కొందరు రైతుల పేర్లను తొలగించారని డిప్యూటీ సీఎంకు విన్నవించారు. రైతులకు పాస్‌బుక్కులు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు డి.బాబుయాదవ్, రాములు, భాస్కర్, రవీందర్, పాండు, మల్లేష్ జంగయ్య అంజయ్య, హరిచందర్, మహేందర్ పాల్గొన్నారు.

గౌరారం పరిసరాల్లో సినిమా షూటింగ్



బొంరాస్‌పేట్, ఆగస్టు 29: మండలంలోని గౌరారం గ్రామ పరిసరాల్లో శివ శంభో సినిమా షూటింగ్ గురువారం జరిగింది. మూడు నెలలుగా ఈ సినిమా షూటింగ్‌ను పలు ప్రాంతాల్లో చిత్రీకరిస్తున్నారు. చివరగా గౌరారం గ్రామంలో కొన్ని సన్నివేశాలను చిత్రీకరించినట్లు నిర్మాతలు రాజగోపాల్, దొరవేటి చెన్నయ్య తెలిపారు. షూటింగ్ పూర్తయిందని, ఎడిటింగ్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్తీకమాసంలో ఈ సినిమా విడుదల కానున్నట్లు తెలిపారు. ఈ షూటింగ్‌లో హీరోలు సుమన్, ఆజాద్, ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్టులు రంగరాజన్, భవానీ శంకర్, వేణు, బేబి రిషిత, దర్శకుడు ఆర్.నర్సింగ్ పాల్గొన్నారు.

వికారాబాద్‌లో వర్షం

వికారాబాద్, ఆగస్టు 29: పట్టణంలో గురువారం సాయంత్రం కొద్దిపాటి వర్షం కురిసింది. వర్షం కురిసిన ప్రతీసారి వికారాబాద్ పట్టణంలోని ఆయా కాలనీలోని అంతర్గత రోడ్లు నీటితో నిండిపోతుండగా ప్రధాన రోడ్లపైకి సైతం వర్షపునీరు వచ్చి ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై అక్కడకక్కడ గుంతలు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

రెండు గ్రామాల్లో
ప్రభుత్వ భూముల సర్వే

కందుకూరు, ఆగస్టు 29: రాష్ట్ర మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆరోపణలతో కందుకూరు మండలం తిమ్మాపూర్, తిమ్మాయపల్లిలోని ప్రభుత్వ భూములను 25రోజులుగా రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. తిమ్మాపూర్‌లోని 38 సర్వే నంబర్‌లోని 350ఎకరాల ప్రభుత్వ భూమిని టీజీఐఐసీ అధికారుల సూచనలతో రెవెన్యూ అధికారులు సర్వే చేస్తున్నారు. ఇప్పటికే ఈ భూములపై గత ప్రభుత్వంలో సర్టిఫికెట్లు పొందిన రైతులు కొందరు ఎకరానికి రూ.40లక్షల చొప్పున రియల్టర్లకు విక్రయించారు. ఇప్పుడు రెవెన్యూ అధికారులు సర్వే చేస్తుండడం స్థానికంగా చర్చనీయాంశమైంది. అలాగే తిమ్మాయపల్లిలోని సర్వే నంబర్ 9లో 380ఎకరాల ప్రభుత్వ భూములను సైతం అధికారులు సర్వే చేస్తున్నారు. తిమ్మాపూర్, తిమ్మాయపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ భూములను సర్వే చేస్తుండడంపై స్థానిక నాయకులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం, టీజీఐఐసీ ఏ ఉద్దేశంతో సర్వే చేయిస్తుందోనని ఆందోళనచెందుతున్నారు.

నాపరాతి గనుల్లో అధికారుల క్షేత్రస్థాయి సర్వే

▸▸ ఉన్నతాధికారులకు ఫిర్యాదుతో చర్యలు


ఓగీపూర్ సర్వేనెంబర్-77లో నిర్వహిస్తున్న మైన్స్, రెవెన్యూ అధికారుల బృందం

తాండూరు రూరల్, ఆగస్టు 29: తాండూరు మండలం ఓగీపూర్ గ్రామ శివారులోని నాపరాతి గనుల్లో అక్రమ తవ్వకాలపై ఇటీవల రాష్ట్ర మైన్స్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేశారు. తాండూరు ప్రాంతానికి చెందిన ఎం.వెంకట్‌రాంరెడ్డి కొన్ని రోజుల కిందట తాండూరు మండలం ఓగీపూర్ గ్రామ శివారులోని నాపరాతి గనుల్లో కొందరు అక్రమార్కులు ఫీజులు లేకుండా అక్రమ తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో అట్టి ఫిర్యాదు మేరకు రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం తాండూరు మైన్స్ ఏడీ సత్యనారాయణ ఆధ్వర్యంలో తాండూరు మైన్స్ శాఖ ఏజీ నాగరాజు, మైన్స్ ఆర్ఐ నిర్మల, సర్వేయర్ అశోక్, రెవెన్యూ శాఖ ఆర్ఐ గోపి, సర్వేయర్ మహేష్‌ల బృందం ఓగీపూర్ గ్రామ శివారులోని సర్వేనెంబర్-64, సర్వేనెంబర్-77లో క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వే నిర్వహించారు. ఏ మేరకు తవ్వకాలు జరిపారు? ఆ సర్వేనెంబర్ ఎంత విస్తీర్ణంలో ఉన్నాయనే దానిపై సమగ్ర వివరాలు సేకరించారు. సర్వేనెంబర్-64లో తొమ్మిది ఎకరాల 6 గుంటలు, సర్వే నెంబర్-77లో 14 ఎకరాల 33 గుంటల భూమిలో అక్రమ తవ్వకాలు జరిపారని ఫిర్యాదు మేరకు అధికారుల బృందం శాటిలైట్ సర్వే నిర్వహించారు. సర్వేనెంబర్-77 సమీపంలో వ్యవసాయ భూములు ఉన్నాయని సర్వేలో అధికారులు నిర్ధారించారు. నాపరాతి తవ్వకాలు, సర్వే నెంబర్ విస్తీర్ణం వంటి సమగ్ర వివరాలను సేకరించారు. సర్వేనెంబర్-77లో కొంతమంది తవ్వకాలతోపాటు కంది పంటలు సాగు చేసినట్లు తేలిందని అధికారులు చెప్పారు. వారి వెంట మైన్స్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న కుటుంబసభ్యుల నిర్ధారణ


కుటుంబసభ్యుల వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్న ఏవో బాసిత్, పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 29: రూ.2లక్షల రైతు రుణమాఫీకి అర్హత ఉన్నా వర్తించని రైతుల ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యుల నిర్ధారణకు మండల వ్యవసాయ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని అవుషాపూర్, ఘట్‌కేసర్ మున్సిపాలిటీతో పాటు పోచారం మున్సిపాలిటీలోని యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలలో గురువారం వ్యవసాయ అధికారులు ఇంటింటికి వెళ్లి కుటుంబసభ్యుల వివరాలను సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. మండలంలోని వివిధ కమర్షియల్ బ్యాంకుల్లో 123 మందికి రుణమాఫీ వివిధ కారణాల వల్ల కాలేదని, వ్యవసాయశాఖ రూపొందించిన రైతు భరోసా పంట రుణమాఫీ యాప్‌ను అమల్లోకి తీసుకొచ్చినట్లు మండల ఏవో బాసిత్ తెలిపారు. కుటుంబ యజమాని రుణఖాతా, బ్యాంకు వివరాలతో పాటు కుటుంబసభ్యుల వివరాలను, రైతు డిక్లరేషన్ పత్రంలో కుటుంబ యజమాని సంతకం, ఫోన్‌నెంబర్‌ను నమోదు చేసిన తర్వాత యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు 123మందికి గానూ 35 మందికి సంబంధించిన కుటుంబసభ్యుల నిర్ధారణ పూర్తయినట్లు ఏవో తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో కుటుంబసభ్యుల నిర్ధారణ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ, ఏఈవో జగదీష్, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఘట్‌కేసర్ రైతుసేవా సహకార సంఘంలో రుణం తీసుకున్న 1230మంది రైతులకు ఇప్పటి వరకు రుణమాఫీ కాలేదు. సహకార సంఘంలో రుణం తీసుకున్న వారికి ఆడిట్ జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.


బహుమతి అందుకుంటున్న రమ్యశ్రీ

వ్యాసరచన పోటీలో విద్యార్థిని ప్రతిభ

మాడ్గుల, అగస్టు 29: తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి సందర్భంగా సికింద్రాబాద్ మచ్చ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 28, 29 తేదీల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఇర్విన్ జడ్పీ పాఠశాల విద్యార్థిని ఎస్.రమ్యశ్రీ మొదటి బహుమతి సాధించింది. బాలికకు రాష్ట్రపతి నిలయం ఎండీ రజినీప్రియ బహుమతి అందచేశారు. ఈ సందర్భంగా రమ్యశ్రీని హెచ్ఎం పర్వతాలు, టీచర్లు అభినందించారు. కార్యక్రమంలో టీచర్ కరుణాకర్, విఘ్నేశ్వర్ పాల్గొన్నారు.


బెల్లయ్యానాయక్‌ను సన్మానిస్తున్న రవీందర్‌నాయక్, రాములు

గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

ఆమనగల్లు, ఆగస్టు 29: గిరిజన సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యానాయక్ అన్నారు. ప్రభుత్వం గిరిజన పథకాలకు బడ్జెట్‌లో రూ.350కోట్లు కేటాయించిందని పేర్కొన్నారు. ఆమనగల్లు, కడ్తాల్లో గురువారం బెల్లయ్యానాయక్ పర్యటించారు. మైసిగండి మైసమ్మ ఆలయాన్ని, ఆమనగల్లు సేవాలాల్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. తండాల అభివృద్ధికి, సదుపాయాల కల్పనకు నిధులు మంజూరు చేయించాలని కోరారు. బెల్లయ్య మాట్లాడుతూ.. గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయం అన్నారు. అన్ని తండాలకు బీటీ రోడ్లు వేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందన్నారు. ప్రభుత్వ పథకాలు గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా/మండల నాయకులు రవీందర్ నాయక్, మండ్లీ రాములు, కృష్ణనాయక్, హీరాసింగ్, జవహర్‌లాల్, సురేశ్, శ్రీధర్, అనిల్‌నాయక్, జయరామ్, దశరథ్, రాజుకుమార్, ఫరీద్, కుమార్‌గౌడ్, గోపి, రాకేశ్, తావుర్య, సురేశ్, కిషన్, తులసీరామ్ పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను
సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతూన్న పురుషోత్తంరెడ్డి

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 29: విద్యార్థులు విద్యదశలో వచ్చే ప్రతీ అవకాశన్ని సద్వినియోగం చేసుకుంటేనే ప్రయోజకులవుతారని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పురుషోత్తంరెడ్డి అన్నారు. హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో గురువారం విద్యార్థులతో ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. పరిశోధనలకు తమ యూనివర్సిటీ ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ విక్రమ్‌రెడ్డి, దామోదర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, వీర వెంకటయ్య, శంకర్ లింగం, కవిత, క్రిస్టొఫర్, సుందర్‌రామ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ప్రభుత్వాలు హామీలను అమలు చేయాలి

కడ్తాల్, ఆగస్టు 29: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గాన్గుమర్ల తండాలో గురువారం కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ జడ్పీటీసీలు దశరథ్‌నాయక్, వెంకటేశ్, విజితారెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీ పథకాలను అమలు చేయకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తిచేయాలన్నారు. కేంద్రం పాలమూరు-రంగారెడ్డి లిఫ్టుకు జాతీయ హోదా కల్పించాలన్నారు. గిరిజనుల జీవన ప్రమాణాల పెంపు, తండాల్లో వసతుల కల్పనకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. సమావేశంలో ఆనంద్, జోగు వీరయ్య, సేవ్యానాయక్, అంజి, లాయక్‌అలీ పాల్గొన్నారు.

యువకులు, పోలీసుల మధ్య
సత్సంబంధాలు మెరుగుపడాలి


మాట్లాడుతున్న మేడ్చల్ డీసీపీ కోటి రెడ్డి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 29: యువకులు, పోలీసుల మధ్య సత్సంబంధాలు మెరుగుపడాలని మేడ్చల్‌జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్లీ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ పోలీసులను డీసీపీ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు పెడదారి పట్టకుండా వారిలో క్రీడానైపుణ్యం పెంచడానికి ఆటలపోటీలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో యువకులు పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. క్రీడల్లో ఫిట్‌నెస్ పెంచుకోదలచిన యువకులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. మాదకద్రవ్యాలు విక్రయించే వారి ఆట పట్టించడానికి పోలీసులకు సహకరించాలన్నారు. యువకుల్లో చైతన్యం తీసుకురావాలన్న ఉద్దేశ్యంతో సైబరాబాద్ కమిషనర్ ఆటల పోటీలను నిర్వహించటానికి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను, యువకులను చైతన్య పర్చడానికి పోలీసుల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతు న్నామన్నారు. సమాజంలో ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరిగిన యువకులు తమ వంతు బాధ్యతగా స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డ్రగ్స్ మాఫియా కళాశాల విద్యార్థులను టార్గెట్‌చేసి విక్రయాలు కొనసాగిస్తోందని, ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ క్రీడా పోటీల్లో మండలానికి చెందిన 16 జట్లు పాల్గొన్నాయి. పోటీల్లో పాల్గొని ప్రతిభ కనపరిచిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ సీఐ సత్యనారాయణ, డిటెక్టివ్ సీఐ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పోచమ్మ, మైసమ్మలకు ఘనంగా బోనాలు



మాడ్గుల మండలం నల్లచెర్వులో బోనాల ఉత్సవం

కందుకూరు/మాడ్గుల/యాచారం/కేశంపేట/తలకొండపల్లి,ఆగస్టు 29: కందుకూరు మండలం కొత్తగూడ, పులిమామిడి, ధన్నారం, గూడూరు గ్రామాల్లో పోచమ్మ, మైసమ్మలకు బోనాల పండగను నిర్వహించారు. కొత్తగూడలో ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పోచమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే గూడూరు, కొత్తగూడ, పులిమామిడి, ధన్నారంలలో పోచమ్మ, మైసమ్మలను కాంగ్రెస్ నాయకుడు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి దర్శించుకొని పూజలు చేశారు. మహిళలు బోనాల నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి,



కొత్తగూడ పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే సబితారెడ్డి పూజలు



కేశంపేటలో చౌడమ్మ బోనాల ఊరేగింపు

పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు జంగారెడ్డి, జంగారెడ్డి, వివిధ పార్టీల నాయకులు సురేందర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, శ్రీదేవిశేఖర్‌రెడ్డి, అనీతాశ్రీనివాస్, మల్లారెడ్డి, యాదయ్య, శ్రీలతశ్రీహరి, గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, తాండ్ర ఇందిరదేవేందర్, టి.కార్తీక్, శేఖర్‌గౌడ్, బి.సంజీవరెడ్డి, దీక్షత్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, సత్యనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాడ్గుల మండలం నల్లచెర్వు, మాడ్గుల, ఇర్విన్, నాగిళ్ల గ్రామాల్లో శ్రావణ బోనాలను నిర్వహించారు. నల్లచెర్వులోని కంఠమహేశ్వరస్వామికి గౌడ కులస్తులు బోనాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో కృష్ణారెడ్డి, సత్తయ్యగౌడ్, మహేష్, పాపయ్యగౌడ్, నవీన్‌గౌడ్, మహేష్, వెంకటయ్యగౌడ్, శివగౌడ్, నాయకులు శ్రావన్‌రెడ్డి, శేఖర్, సూదిని శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. యాచారం మండలం కుర్మిద్దలో ఈదమ్మ బోనాలను వడ్డెరలు జరుపుకున్నారు. డప్పు చప్పుళ్లతో బోనాలను ఊరేగించారు. రెండురోజులుగా గ్రామంలో సోమన్న, ఈదమ్మ బోనాలన పండుగను నిర్వహించారు. గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేశంపేటలో చౌడమ్మ, చెర్లమైసమ్మ బోనాలను నిర్వహించారు. మహిళలు ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించి, నైవేద్యం సమర్పించారు. ఎక్లాస్‌ఖాన్‌పేట, చింతకుంటపల్లి గ్రామాల్లోనూ బోనాలు నిర్వహించారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో పోచమ్మ బోనాలను నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శరత్, నాయకులు పెంటయ్యగౌడ్, రాజేందర్‌రెడ్డి, సుధాకర్‌రాజు, కృష్ణ, రమేష్ పాల్గొన్నారు. దేవుని పడకల్‌లోనూ బోనాల ఉత్సవాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ కావ్యశ్రీశైలం పాల్గొన్నారు.



కందుకూరు : గూడూరులో పోచమ్మ ఆలయాన్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



యాచారం మండలం కుర్మిద్దలో ఈదమ్మ బోనాల ఊరేగింపు

క్రైం కార్నర్

వాహనం ఢీకొని కార్మికుడి మృతి

శంషాబాద్, ఆగస్టు 29: శంషాబాద్‌లోని సిద్ధాంతి బస్తీ వద్ద జాతీయ రహదారిపై గురువారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ కార్మికుడు మృతిచెందాడు. ఆర్జీఐఏ పోలీసుల వివరాల మేరకు భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం దుబ్యాలకు చెందిన సంగి మహేష్(33), తన భార్య ఉమాదేవితో కలసి శంషాబాద్‌కు వలసొచ్చాడు. ఎయిర్‌పోర్టులో ఓ ప్రైవేట్ కంపెనీలో కూలి పని చేసేవాడు. నైట్ డ్యూటీకి వెళ్లిన మహేష్ తెల్లవారుజామున బైక్‌పై ఇంటికి వస్తుండగా నీమ్‌ట్రీ వద్ద వెనుకనుంచి వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. మోటార్‌సైకిల్ హోటల్ వద్ద ఆగి ఉన్న కారును ఢీకొంది. దీంతో మహేష్ గాయపడ్డాడు. స్థానికులు స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేసి క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మహేష్ మృతిచెందాడని డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు ఆర్జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చోరీలకు పాల్పడిన దొంగల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 29: రోడ్ల వెంట ఉన్న దుకాణాల్లో చోరీలు చేసేందుకు రెక్కీ నిర్వహించి రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ రంగస్వామి తెలిపారు. షాద్‌నగర్ పీఎస్‌లో గురువారం విలేకరుల వివరాలు వెల్లడించారు. బెంగళూరుకు చెందిన గంగాధర్ అనే వ్యక్తి అనిల్, కర్ణాటక రాష్ట్రం తిప్పపురకు చెందిన హన్మంత్‌రాజ్(30), చిక్కతుమ్మకూర్‌కు చెందిన పృథ్వీరాజ్(25), అభి అలియాస్ అభిషేక్, శశిలతో గ్యాంగ్ ఏర్పాటు చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల 19న షాద్‌నగర్‌లోని పాత జాతీయ రహదారి పక్కన జీఆర్ ఎలక్ట్రానిక్స్, మరో మూడు దుకాణాల్లో చోరీ చేశారు. షాబాద్‌లో రెండు దుకాణాల్లో, మొయినాబాద్‌లో ఒక దుకాణంలో చోరీ చేశారన్నారు. అరుగురిలో ఒకరు కారు స్టార్ట్ చేసి ఒకరు రెడీగా ఉండగా ఐదుగురు షట్టర్లు లేపి చోరీ చేస్తారన్నారు. గంగాధర్ నగదు, సీసీ కెమెరా డీవీఆర్‌లు ఎత్తుకెళ్తారని తెలిపారు. షాద్‌నగర్‌లో రూ.5లక్షల దొంగతనం చేశారన్నారు. గంగాధర్, అనిల్‌లను వేరే కేసులో బెంగళూరు పోలీసులు అరెస్ట్‌చేయగా హన్మంత్‌రాజ్, పృథ్వీరాజ్‌లను రిమాండ్‌కు పంపామన్నారు. అభి, శశి పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందితుల నుంచి రూ.10వేలను స్వాధీనం చేసుకున్నామని, మిగతా సొమ్మును రికవరీ చేస్తామన్నారు. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, సీసీఎస్ సీఐ పవన్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బాలానగర్, ఆగస్టు 29: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొందుర్గు మండలం పర్వతాపూర్‌కు చెందిన రాములు(38) ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. అత్తగారి ఊరు అయిన మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్‌కు వచ్చాడు. అప్పులు భరించలేక గురువారం తెల్లవారుజామున బాలానగర్ మండల కేంద్రంలోని పెద్దాయపల్లిచౌరస్తాలో ఓ చింత చెట్టుకు ఉరేసుకున్నాడు. రాములుకు భార్య, ఉద్దరు పిల్లలు ఉన్నారు. అతడి భార్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపాజి తెలిపారు.

ప్రియురాలిని చంపి.. ప్రియుడి ఆత్మహత్యాయత్నం

మొయినాబాద్, ఆగస్టు 28: ప్రేమించిన యువతిని హత్య చేసిన ఓ యువకుడు తానూ ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మొయినాబాద్ మండలంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ నానక్‌రాంగూడలో పనిచేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన యువతి, కర్ణాటక రాష్ట్ర బీదర్‌కు చెందన రాకేష్‌లకు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. తనను పెళ్లి చేసుకోవాలని యువతి కోరడంతో వారు గొడవపెట్టుకున్నారు. దీంతో రాకేష్ యువతిని నానక్‌రాంగూడలో హత్యచేసి పారిపోయి మొయినాబాద్ వచ్చాడు. తననూ చంపుతారన్న భయంతో రాకేష్ కనకమామిడి పరిధిలో హైదరాబాద్-బీజాపూర్ హైవే పక్కన హైటెన్షన్ లైన్ స్తంభం వైర్లు పట్టుకున్నాడు. కరెంట్ షాక్‌తో కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది సమాచారంతో పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. రాకేష్ ప్రస్తుతం ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

గుట్కా, అక్రమ మద్యం స్వాధీనం

కొందుర్గు, ఆగస్టు, 29: కొందుర్గులో గురువారం చేపట్టిన తనిఖీల్లో గుట్కా ప్యాకెట్లు, అక్రమ మద్యం లభించాయని షాద్‌నగర్ రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. 6 కిరాణ షాపులను, పాన్‌షాపులను తనిఖీ చేశామన్నారు. పాన్ షాపులో 4వేల విలువైన గుట్కా ప్యాకెట్లు లభించాయని, 10బెల్టు షాపులను తనిఖీ చేయగా, రెండు బెల్టుషాపుల్లో 11వేల విలువైన 20లీటర్ల మద్యం లభించిందన్నారు. వాటిని సీజ్ చేసి బాధ్యులపై కేసులు నమోదు చేయనున్నట్లు సీఐ వివరించారు. తనిఖీల్లో షాద్‌నగర్, కొందుర్గు ఎస్సైలు బాలరాం, సుశీల, కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై దాడి చేసిన 25 మందిపై కేసు నమోదు

షాబాద్, ఆగస్టు 29: చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యపై దాడి చేసిన సొంత పార్టీ నాయకులు 25మందిపై కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి గురువారం తెలిపారు. నేతల పర్యటనల్లో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

క్రీడారంగంలోనూ రాణించాలి



చెక్కు అందజేస్తున్న మహేందర్ తదితరులు

కందుకూరు, ఆగస్టు 29: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బీజేవైఎం స్పోర్ట్స్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ అన్నారు. గురువారం ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని లేమూరు, బైరాగూడ పంచాయతీల్లోని గురుకుల పాఠశాల విద్యార్థులకు క్రీడాసామగ్రికి రూ.20వేల చెక్కు అందజేశారు. విద్యార్థులు ధ్యాన్‌చంద్ లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.యాదీష్‌ఖ, దిలీప్‌గౌడ్, పాండు, సంతోష్, శ్రీశైలం, వంశీ, నవీన్, కల్యాణ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

తలకొండపల్లి, ఆగస్టు 29: చీపునుంతలలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కామినేని ఆసుపత్రి సహకారంతో శిబిరం ఏర్పాటు చేశారు. మాజీ జడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ శిబిరాన్ని ప్రారంభించారు. 216మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వెంకటేష్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ చారిటబుల్ ట్రస్ట్ సేవలను కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటేశ్ సూచించారు. కార్యక్రమంలో నాయకులు జనార్ధన్‌రెడ్డి, నరోత్తమ్‌రెడ్డి, బాలకుమార్‌గౌడ్, గిరి, బ్రహ్మచారి, శేఖర్, తిరుపతిరెడ్డి, మధు, మల్లేశ్, పర్వతాలు, యాదిలాల్, లక్ష్మణ్, దేవులా, పాండు, పవన్, సాయినాథ్, కృష్ణ, పంచాయతీ కార్యదర్శి యాదగిరి పాల్గొన్నారు.

మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న అభిషేక్, కృష్ణారావు తదితరులు

మొయినాబాద్ రూరల్, ఆగస్టు29: ఇంజినీరింగ్ విద్య అంటేనే పరిశోధనలకు కేరాఫ్ అడ్రస్ అని, ఇక్కడి నుంచే విద్యార్థులు మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని ప్రముఖ ఐటీ కంపెనీ వర్చుసా లీడ్ ఇండియాన్ ప్రతినిధి అభిషేక్, భాస్కర విద్యాసంస్థల కార్యదర్శి జేవీ.కృష్ణారావు అన్నారు. ఎన్కేపల్లిలోని ఇంజనీరింగ్ కళాశాలలో కొత్త విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ డేను నిర్వహించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. భవిష్యత్తుకు ఇక్కడి నుంచే పునాదులు వేసుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ అంటేనే పరిశోధనలతో కూడుకున్నదని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమాచారి, బ్రిజ్ బంధుదాస్, రాజశేఖర్‌రెడ్డి, డీన్ హిమాన్షుశర్మ, సలావుద్దీన్, విద్యా సంస్థల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారు

ఆమనగల్లు, ఆగస్టు 29: ప్రాణాపాయ స్థితిలో ఉన్న తోటి వ్యక్తులను కాపాడడంలో రక్తదాతలు ప్రాణదాతలుగా నిలుస్తారని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి అన్నారు. అన్ని దానాల్లో కెల్లా రక్తదానం చాలా గొప్పదని పేర్కొన్నారు. ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుందరపురంలో గురువారం రక్తదానం శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ జూలూరి రమేష్, రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి అంజిరెడ్డితో కలిసి లక్ష్మారెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 25మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని బ్లడ్ బ్యాంకుల ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అందజేయడం జరుగుతుందని లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. పీఆర్‌వో పాషా, మోహన్‌రెడ్డి, నర్సింహ, మిట్టపల్లి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: రక్తదానం మహాదానం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్ ప్రెసిడెంట్ పి.లక్ష్మారెడ్డి అన్నారు. సుందరాపురంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 30మంది యువకులు రక్తదానం చేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి రక్తదానం చేయాలని సూచించారు. యువత విరివిగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. 108సార్లు రక్తదానం చేసిన పోతిరెడ్డి అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ రాములు, మాజీ ఉపసర్పంచ్ యారం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొనానరు.

రుణమాఫీ కోసం ఇంటింటి సర్వే



హాజీపల్లిలో సర్వే చేస్తున్న ఏఓ నిశాంత్‌కుమార్

షాద్‌నగర్ అర్బన్/కేశంపేట/కొందుర్గు, ఆగస్టు 29: రుణమాఫీ రాని రైతులను గుర్తించేందుకు వ్యవసాయశాఖ ఇంటింటి సర్వే చేస్తోంది. ప్రభుత్వ యాప్‌లో రుణమాఫీ పొందని రైతుల వివరాలను పొందుపరుస్తూ, ఫ్యామిలీ గ్రూపింగ్‌ను చేస్తున్నారు. ఫరూఖ్‌నగర్ మండల ఏవో నిశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం హాజీపల్లి, కిషన్‌నగర్‌లలో సర్వే చేపట్టారు. రేషన్‌కార్డులేని రైతులతో పాటు రెండు లక్షలకుపైగా రుణం ఉన్న రైతుల వివరాలు పొందుపరుస్తున్నారు. బ్యాంకర్ల తప్పిదంతో రుణం పొందని రైతుల వివరాలను కూడా తీసుకుంటున్నారు. పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతా నంబర్ వివరాలను సరిచూస్తూ, కుటుంబీకులతో సెల్ఫీ ఫొటో తీసుకుని, అప్‌లోడ్ చేస్తున్నారు. రోజూ రెండు గ్రామాల్లో సర్వే చేస్తామని నిశాంత్‌కుమార్ తెలిపారు. సర్వేలో ఏఈఓలు తేజ్‌కుమార్, గోవర్ధన్, రాంబాబు, ప్రణీతలు పాల్గొన్నారు. కేశంపేట మండల ఏవో శిరీష మాట్లాడుతూ రైతుల సర్వేను బుధవారం ప్రారంభించామని సెప్టెంబర్ 26వరకు కొనసాగుతుందని చెప్పారు. ఆగస్టు 30, 31 తేదీల్లో అల్వాల, సెప్టెంబరు 2న చౌలపల్లి, 3న లేమామిడి, 4న పాపిరెడ్డిగూడ, 5న ఇప్పలపల్లి, 6న పోమాల్‌పల్లి, 9న కొండారెడ్డిపల్లి, 10న సంగెం, 11న వేముల్‌నర్వ, 12న ఎక్లాస్‌ఖాన్‌పేట, 13న కొత్తపేట, 17న సంతాపూర్, 18న బైర్కాన్‌పల్లి, 19న లేమామిడి, 20న బొదునంపల్లి, 21న కాకునూర్, 23న నిర్దవెల్లి, 24న తొమ్మిదిరేకుల, 25న లింగంధన, 26న దత్తయపల్లి గ్రామాల్లో సర్వే చేస్తామన్నారు. రైతులు ఆయా తేదీల్లో ఆయా గ్రామాల్లో అందుబాటులో ఉండి వివరాలను నమోదు చేసుకోవాలని ఏవో కోరారు. రుణమా ఫీ కానీ రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు కొం దుర్గు ఏవో శోభారాణి తెలిపారు. 28న ప్రారంభమైన సర్వే సెప్టెంబరు 20 వరకు కొనసాగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తామని వారు వివరించారు. ఈ అవకాశాన్ని అర్హత ఉండి రుణమాఫీ కానీ రైతు లు వినియోగించుకోవాలని ఆమె కోరారు. మం డల కేంద్రంలోని రైతువేదికకు వచ్చిన రైతుల నుంచి వివరాలను అధికారులు సేకరించారు.



కేశంపేట: వివరాలు సేకరిస్తున్న ఏవో



కొందుర్గు: దరఖాస్తు చేస్తున్న రైతులు

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి



పహిల్వాన్ చెరువును పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి

షాబాద్, ఆగస్టు 29 : పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి అన్నారు. రానున్న వినాయక చవితి వేడుకల సందర్భంగా గురువారం ఆయన షాబాద్ పహిల్వాన్ చెరువును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పండుగల్లో ఎలాంటి గొడవలకు ఆస్కారం ఇవ్వొద్దని ప్రజలను కోరారు. గణేష్ నిమజ్జనం చేసే చెరువును పరిశీలించామన్నారు. ఆయనతో ఎస్సై మహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఎస్ఐని కలిసిన డీఎస్పీ నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 29: ఆమనగల్లు ఎస్ఐ బి.వెంకటేశ్‌ను గురువారం ధర్మసమాజ్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ జిల్లా కార్యదర్శి వంకేశ్వరం రమేశ్ ఆధ్వర్యంలో నాయకులు ఎస్ఐని కలిసి సత్కరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని వెంకటేశ్ కోరారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆమనగల్లు మండల అధ్యక్షుడు బలరామ్, నాయకులు శ్రీకాంత్, ప్రవీణ్, హరి, నరేందర్, తదితరులు ఉన్నారు.

ఓటరు లిస్టులో తప్పులు దొర్లకుండా చూడాలి

కేశంపేట, ఆగస్టు 29: ఓటరు లిస్టులో తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని కేశంపేట తహసీల్దార్ మీర్ అజం అలీ సూచించారు. వేముల్‌నర్వలో గురువారం ఇంటింటి ఓటరు పరిశీలననుతనిఖీ చేశారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓట్ల వివరాలను పరిశీలించాలని సూచించారు. ఓటరు లిస్టులో తప్పులుంటే సరిచేయాలన్నారు. లిస్టులో తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. 18ఏళ్లు నిండిన యువతీ, యువకులు నూతన ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

బస్టాండ్‌లో రెగ్యులర్ కంట్రోలర్‌ను నియమించండి



కంట్రోలర్ లేని యాచారం బస్టాండ్

యాచారం, ఆగస్టు 29 : యాచారం మండల కేంద్రంలో రెగ్యులర్ కంట్రోలర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో అధికారులు ఉదయం 8గంటల నుంచి రాత్రి 9గంటల వరకు నిరంతరం కంట్రోలర్‌ను నియమించి ప్రయాణీకులకు ఇబ్బందులు రాకుండ చూడాలని వివిధ గ్రామాల ప్రయాణికులు కోరుతున్నారు. కంట్రోలర్‌కు సెలవు ఉన్న రోజున వేరే వ్యక్తిని కంట్రోలర్‌గా నియమించడం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ప్రయాణికులు కోరుతున్నారు.

పీఆర్టీయూ మండల కార్యవర్గం ఎన్నిక

షాబాద్, ఆగస్టు 29: షాబాద్ మండలంలో పీఆర్‌టీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి జక్కని బందయ్య తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి గోవర్ధన్‌యాదవ్, మహేందర్‌రెడ్డిల సమక్షంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా డేవిడ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కృష్ణ, గౌరవాధ్యక్షుడు అంజయ్య, అసోసియేట్ అధ్యక్షుడు ఖాజాపాషా, కార్యదర్శి గోవింద్, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలు సుశీల, కార్యదర్శిగా సునీతలను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల సాధనలో పీఆర్‌టీయూ ఎప్పుడూ ముందుంటుందన్నారు. 50శాతం ఫిట్మెంట్‌లో పీఆర్‌సీని సాధిస్తామన్నారు. ఈహెచ్‌ఎస్ హెల్త్‌కార్డులు కూడా త్వరలో తీస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో ఐదువేల పోస్టులను భర్తీ చేసేలా ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు నర్సింహులు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి బోనాలు ప్రతీక

కడ్తాల్, ఆగస్టు 29: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి బోనాల వేడుక ప్రతీక అని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. కడ్తాలలోని పోచమ్మ ఆలయంలో గురువారం పూజలు నిర్వహించారు. నాలుగు రోజుల బోనాల వేడుక ముగింపు నేపథ్యంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యం, సభ్యులకు జీఎల్ఎన్‌రెడ్డి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకకు సహకరించిన దాతలు, నాయకులు, వివిధ కుల సంఘాల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, మాలే మల్లేశ్‌గౌడ్, రాములు, సత్యం, ఆంజనేయులు, హన్మనాయక్, బాలయ్య, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్, లాయక్‌అలీ, యాదయ్య, వెంకటయ్య, కృష్ణయ్య, వెంకటేశ్, రాజు, పాండు, రవి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, గణేశ్, రాజు, శేఖర్, శ్రీమన్నారాయణ, రవి, చంద్రయ్య పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపీడీవో

తలకొండపల్లి, ఆగస్టు 29: మండల కేంద్రంలోని బాలుర హాస్టల్‌ను గురువారం ఎంపీడీవో శ్రీకాంత్ సందర్శించారు. రికార్డులు, గదులు, పరిసరాలు, వాటర్ ట్యాంక్‌లను, స్టోర్‌రూంను పరిశీలించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని వసతిగృహ అధికారి శ్రీనివాస్‌కు సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నందున విద్యార్థులు అన్ని ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని, వసతి గృహ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని శ్రీకాంత్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో రఘు, పంచాయతీ కార్యదర్శి సత్యం, హెచ్‌డబ్ల్యువో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మా భూములు మాకు ఇప్పించండి'

పంజాగుట్ట, ఆగస్టు 29: ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ, ఓ వ్యక్తి కుమ్మక్కై తమ భూములను కబ్జాచేసి వాటిలో నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేసి తమ భూములను తమకు అప్పగించాలని శంకర్‌పల్లి మండలం కొండకల్ పంచాయతీ పరిధి తండావాసులు కోరుతున్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో తండావాసులు, బాధితులు రవి రాథోడ్, లక్ష్మణ్, శంకర్, ఆర్.వసన్, ఆర్.మోహన్, చందర్ తమ గోడును వెళ్లబోసుకున్నారు. 'కొండకల్‌లోని సర్వే నంబర్ 362, 363, 364, 377లలోని తమ భూములను ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ఆక్రమించుకోవాలని చూస్తోందని ఆరోపించారు.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లచ్చిరెడ్డి

మంచాల, ఆగస్టు 29: క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.లచ్చిరెడ్డి శ్రేణులకు సూచించారు. గురువారం బీజేపీ మంచాల మండల బూత్ అధ్యక్షులు, కార్యవర్గంతో సమావేశం నిర్వహించారు. జి.లచ్చిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలపై గడపగడపకూ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతంగా పూర్తిచేయాలన్నారు. సభ్యత్వ నమోదు మండల కన్వీనర్‌గా బండిరాజు, కో-కన్వీనర్లు పాండు, ఐలయ్యలను నియమించారు. బీజేపీ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు పాండాల జంగయ్యగౌడ్, రాజు, నాయకులు బాషయ్య, జనార్ధన్‌రెడ్డి, శ్రీశైలం, శేఖర్‌రెడ్డి, బిక్షపతి, రమేష్, శివగౌడ్, విజయప్రసాద్, సందీప్ పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వరప్ప వర్ధంతి

మంచాల, ఆగస్టు 29:జాపాలలో కామ్రేడ్ ఈశ్వరప్ప 27వ వర్ధంతిని గురువారం ఆయన కుమారుడు మల్లప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈశ్వరప్ప స్థూపం వద్ద చిత్రపటానికి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కె.రాంరెడ్డి, యాదయ్య, మంథని ఐల య్య, ఓరుగంటి మల్లయ్య, మంతని పర్వతాలు, నర్సింహ, బుగ్గ రాములు, మల్లయ్య, గణేష్, ధనుంజయచారి, జంగయ్య పాల్గొన్నారు.

రాచకొండలో గోశాలకు భూమిపూజ

మంచాల, ఆగస్టు 29: రాచకొండలో గోరక్షణ చారిటబుల్ ట్రస్టు ఏర్పాటుచేసే రాచకొండ గోరక్షణ గోశాల ఏర్పాటుకు గురువారం భూమి పూజ నిర్వహించారు. తిప్పాయిగూడ నుంచి సరళమైసమ్మ ఆలయం మార్గంలో ఈ గోశాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ఆదిదేవ ఫౌండేషన్ చైర్మన్ డా.సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ.. ఫౌండేషన్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సేవాకార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని చెప్పారు. ప్రజా సేవ తమ కర్తవ్యం అన్నారు. కార్యక్రమంలో రాచకొండ మాజీ సర్పంచ్ ఒగ్గు గణేష్, మాజీ ఉపసర్పంచ్ పుట్టపర్వతాలు, తిప్పాయిగూడ మాజీ సర్పంచ్ చివిరాల పాండు, జెనిగె సురేష్, మారపాక నర్సింహ, మారమోని శ్రీశైలం, వెదిరె జగదీశ్వర్‌రెడ్డి, గజ్జి ఐలయ్య, చిరంజీవి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన టీచర్లకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న స్థానికులు

శంషాబాద్/ చౌదరిగూడ, ఆగస్టు 29: శంషాబాద్ పరిధి కొత్వాల్‌గూడ పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులను హెచ్ఎం స్వరూపారాణి ఆధ్వర్యంలో గురవారం కౌన్సిలర్ లక్ష్మీశ్రీనివాస్‌గౌడ్, గ్రామస్తులు సన్మానించారు. కౌన్సిలర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పేపాఠాల వల్లే విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుందన్నారు. బదిలీపై వెళ్లిన బాల్‌రాజ్, సుధానీరజ, లిల్లీ రోజీస్, చందన్‌రావు, లక్ష్మిలను సన్మానించారు. కార్యక్రమంలో రాజిరెడ్డి, రఘునందన్‌గౌడ్, నరసింగరావు, శేఖర్‌గుప్తా, పూర్వ ఎంఈవో రాంరెడ్డి, ప్రస్తుత ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, వెంకటరమణగౌడ్, బాల్‌రెడ్డి, వీరమల్లేష్, సురేందర్, ఈశ్వర్, స్వరూప, యాదయ్య పాల్గొన్నారు. అలాగే జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన టీచర్లు శేఖర్‌గౌడ్, తులసీకృష్ణలను మాజీ సర్పంచ్ కవితగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. నూతనంగా వచ్చిన టీచర్లు రాములు, పరమేశ్వరిలకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం సునీత, రాములు, చెన్నయ్య రాములమ్మ, జంగయ్య, టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



వనంపల్లిలో..

ఇన్‌చార్జి డీఎస్వోకు డీలర్ల సత్కారం

మహేశ్వరం, ఆగస్టు 29 : జిల్లా అసిస్టెంట్ సివిల్ సప్లయీస్ అధికారి గంప శ్రీనివాస్ ఇన్‌చార్జి డీఎస్వోగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా రేషన్ డీలర్ల సంఘం తరపున ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు సువర్ణలక్ష్మీనారాయణగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ భానుప్రకాష్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు రఫీక్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రజలకు ఉత్తమ సేవలందించాలని ఈ సందర్భంగా అధికారి సూచించారు.